సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 5 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి. మార్కెట్‌కు 9 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



ఎక్కడా లోటు రాకూడదు

ఈ నెల ఏడో తేదీన పుట్టపర్తిలో సీఎం జగన్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని మంత్రులు పెద్దిరెడ్డి , గుమ్మనూరు అధికారులను ఆదేశించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం

33.4°/19.6°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేకువజామున చలి వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమైంది. తూర్పు దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.



ధర్మవరంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర సభలో పాల్గొన్న అశేష జనవాహిని

ధర్మవరంలో జన గర్జన



సభలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, డాక్టర్ తిప్పేస్వామి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ బుట్టారేణుక, పురం సమన్వయకర్త దీపిక, కార్పొరేషన్ చైర్మన్లు మీసాల రంగన్న, హరీష్‌కుమార్ యాదవ్ తదితరులు

- వెల్లివిరిసిన సామాజిక చైతన్యం
- ఉద్రూతలూగించిన నేతల ప్రసంగం
- సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం

ధర్మవరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఏకమయ్యారు. తమకు పదవులిచ్చి అధికారం కట్టబెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞత తెలుపుతూ జగన్నినాదాలతో ధర్మవరంలో గర్జించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కదం తొక్కారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన 'సామాజిక సాధికార బస్సు యాత్ర'కు భారీగా తరలివచ్చి విజయవంతం చేశారు. సభలో నేతల ప్రసంగాలు ఉద్రూతలూగించగా, సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సామాజిక సాధికార సభలో ఉప ముఖ్య మంత్రి అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రులు అనిల్‌కుమార్ యాదవ్, మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, సిద్దారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీశ్ కుమార్ యాదవ్, రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న, జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక, ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, చేనేత నాయకుడు గిర్రాజు నగేశ్, ముదిగుబ్బ ఎంపీపీ ఆది యాదవ్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.



సభకు విచ్చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు

దిగ్విజయంగా సాగిన యాత్ర..

సామాజిక సాధికార బస్సు యాత్ర ధర్మవరం నియోజకవర్గంలో దిగ్విజయంగా సాగింది. సీఎం వైఎస్ జగన్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జరిగిన ప్రయోజనాలతో పాటు, చేనేతలకు ప్రత్యేకంగా కలిగిన లబ్ధిపై యాత్రలో నేతలు ప్రస్తావించారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు సభ అసాంతం వక్తల ప్రసంగాలు శ్రద్ధగా వినడమే కాకుండా.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. జగనన్న వచ్చాకే సామాజిక సాధికారత సాధ్యమైందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు.



జై జగన్ : సభలో నినదిస్తున్న మహిళలు

జగన్‌తోనే ఉజ్వల భవిష్యత్



మళ్లీ జగన్ సీఎం అయితేనే బడుగు, బలహీన వర్గాలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. పేదరికం పోవాలంటే 2024లో మళ్లీ జగన్ సీఎంగా అధికారం చేపట్టాలి. సామాన్యుడికి సైతం అత్యున్నత పదవులను కట్టబెట్టిన ఘనత జగన్‌దే. దళితులకు హోం మంత్రి పదవి ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

– డాక్టర్ తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా..



రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగుతోంది. జగనన్న అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెన, నాడు – నేడు పథకాలు పేదల జీవితాలను మార్చాయి. ఒకప్పుడు నిరక్షరాస్యులైన పిల్లలు నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. జగనన్న చేపట్టిన సంస్కరణలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పిల్లలే అత్యధికంగా లబ్ధి పొందారు. – గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

బీసీలు గర్వపడాలి



జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నడుస్తున్నందుకు మనమంతా గర్వపడాలి. జగనన్న ప్రభుత్వంలో బడుగు, బలహీనవర్గాలకు అందుతున్న సంక్షేమం దేశంలోనే ఎక్కడా అందడం లేదు. బడుగు, బలహీన వర్గాలంటే ఎంతో ప్రేమ చూపే మన సీఎం.. ఎన్నడూ వారిని ఓటుబ్యాంకుగా చూడలేదు. సమాజానికి వెన్నెముకలాంటివారు నా బీసీలు అని సగర్వంగా చాటిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ప్రభుత్వంలో భాగస్వాములను చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కింది. – శంకరనారాయణ, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

మహిళలకు పెద్దపీట



సీఎం జగనన్న మహిళలకు పెద్ద పీట వేశారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జెడ్పీ, స్థానిక సంస్థల్లో పదవులు కట్టబెట్టారు. గతంలో ఎన్నడూ, ఏ రాజకీయ పార్టీ కూడా మహిళలకు ఇన్ని పదవులు ఇవ్వలేదు. మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నారు.

– జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించారు



బడుగు, బలహీన వర్గాలకు మేలు చేయాలనే తపన ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. పాదయాత్రలో ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా అమలు చేశారు. అక్కడితో ఆగకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేశారు. చాలా మందికి కార్పొరేషన్ల చైర్మన్లుగా, జిల్లా పరిషత్ చైర్మన్లుగా, మేయర్లుగా అవకాశం కల్పించారు. అటు రాజ్యసభ, ఇటు శాసనసభలోనూ గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాతినిధ్యం కల్పించారు.

– బుట్టా రేణుక, మాజీ ఎంపీ

సామాజిక న్యాయానికి సరైన అర్థం చెప్పారు



బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీల గురించి గతంలో నాయకుల ఆలోచన విధానం ఎలా ఉంది? మన రాష్ట్రంలో ఇప్పుడు జగనన్న పాలనలో ఎలా ఉందని మనమంతా ఆలోచించాలి. జనాభాలో అత్యధిక శాతం ఉన్న వారిని ఓటర్లుగా కాకుండా, నాయకులుగా చూశారు. వారికీ అధికారం ఇవ్వాలన్న సంకల్పంతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులిచ్చారు. సామాజిక న్యాయానికి సరైన అర్థం చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలోని 86 శాతం మందికి, ధర్మవరం నియోజకవర్గంలో 96 శాతం మందికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయి. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో కులగణనకు ఆమోదం తెలపడం సాహసోపేత నిర్ణయం. కులగణన పూర్తయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రస్తుతం కల్పించిన ప్రాధాన్యం భవిష్యత్తులో రెట్టింపు అవుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మున్సిపల్ చైర్మన్ స్థానాలు జనరల్‌కు వచ్చినా.. బీసీ, మైనార్టీలకే కేటాయించారు. ఒక్క మున్సిపాలిటీ (తాడిపత్రి) గెలిచిన టీడీపీ మాత్రం రెడ్డి కులానికి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెట్టింది. ఇదే జగన్‌కు, చంద్రబాబుకు ఉన్న తేడా. – ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మేము మద్దతిస్తున్నాం: సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ యువత

క్లుప్తంగా

'108'లో ప్రసవం



నవజాత శిశువును పరిశీలిస్తున్న ఆశ కార్యకర్త

లేపాక్షి: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం లోనే 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాలు... లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన గర్భిణి గంగోత్రికి శనివారం ఉదయం పురిటి నొప్పులు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆ గ్రామానికి చేరుకుని గర్భిణిని తీసుకుని హిందూపురంలోని జిల్లాస్పత్రికి బయలుదేరింది. మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఈఎంటీ అమరనాథ్, పైలెట్ నటేష్... ప్రసవానికి సహకరించారు. పండంటి ఆడబిడ్డను ఆమె ప్రసవించింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రికి చేర్చారు.

రేపు జాబ్ మేళా

అనంతపురం అగ్రికల్చర్: 'స్పందన స్ఫూర్తి' ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో బ్రాంచ్ మేనేజర్, క్రెడిట్ అసిస్టెంట్ల పోస్టుల నియామకానికి ఈనెల 6న అనంతపురం ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కళ్యాణి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు 20 నుంచి 27 సంవత్సరాల్లోపు వయస్సు, డిగ్రీ విద్యార్హత, బ్యాంకింగ్ రంగంలో అనుభవం కలిగిన వారు అర్హులు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పనిచేయాలి. రూ.20 వేల వేతనం ఇస్తారు. అలాగే ఉమ్మడి జిల్లా పరిధిలో క్రెడిట్ అసిస్టెంట్‌గా పనిచేయడానికి 20 నుంచి 27 సంవత్సరాలోపు వయస్సు, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉన్న వారు అర్హులు. నెలసరి వేతనం రూ.14 వేలు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో ఈనెల 6న ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు.

ఎక్కడా లోటు రాకూడదు

- సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
- మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం
- అధికారులతో సమీక్ష... బహిరంగ సభా మైదానం పరిశీలన



బహిరంగ సభావేదికను పరిశీలిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, సిద్దారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తదితరులు

పుట్టపర్తి అర్బన్/రూరల్: 'సీఎం వైఎస్ జగన్ ఈ నెల 7న పుట్టపర్తి వస్తున్నారు. ఏర్పాట్లు ఘనంగా ఉండాలి. ఎక్కడా ఎలాంటి లోటు రాకూడదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి' అని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు శనివారం పుట్టపర్తి విచ్చేసిన మంత్రులు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ, డాక్టర్ సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పెద్దిరెడ్డి, గుమ్మనూరు మాట్లాడుతూ.. 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' సొమ్ము పుట్టపర్తి సభ నుంచే రాష్ట్రంలోని రైతులకు సీఎం జగన్ విడుదల చేస్తారన్నారు. 6వ తేదీ సాయంత్రంలోపు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా రైతులకు సీఎం జగన్ మేలు చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 99.05 శాతం నెరవేర్చారన్నారు. రైతులు ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. రైతాంగం, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం విమానం ల్యాండ్ కానున్న సత్యసాయి విమానాశ్రయం, బహిరంగ సభ వేదిక, వాహనాల పార్కింగ్, రహదారులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీ (మంగళవారం) పుట్టపర్తికి విచ్చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. 7వ తేదీ ఉదయం 10.15 గంటలకు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం చేరుకుని ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. 10.45 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 10.50 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేస్తారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ప్రసంగం తర్వాత 11.20 గంటలకు రైతులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12.05 గంటలకు సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12.15 గంటలకు రైతు భరోసా చెక్కును రైతులకు అందజేస్తారు. 12.25 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో 12.55 వరకూ సమావేశం అవుతారు. ఒంటి గంటకు తిరిగి గన్నవరం వెళ్లిపోతారని కలెక్టర్ వెల్లడించారు.

ఏర్పాట్లు పరిశీలించిన డీఐజీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టపర్తి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. సత్యసాయి విమానాశ్రయం సమీపంలోని సభాస్థలిని పరిశీలించి, పోలీసులకు తగిన సూచనలు చేశారు. సీఎం కాన్వాయ్, ఎస్కార్ట్, పార్కింగ్ భద్రత ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

దొంగ కథ.. దీన గాథ!



అనంతపురం క్రైం: కిలో బంగారం చోరీ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న దొంగ దీనగాథ పోలీసుల హృదయాలను కరిగించింది. యువకుడి కష్టాలను విన్న పోలీసులు పాపం విధి వంచితుడంటూ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.వివరాలు.. గుజరాత్‌లోని సూరత్ ప్రాంతానికి చెందిన వినయ్ తల్లిదండ్రుల ఎడబాటును తట్టుకోలేక ఆరేళ్ల వయసులోనే ఇల్లు వదిలి రైల్లో ప్రయాణిస్తూ అనంతపురం చేరుకున్నాడు. ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు విచారించి, తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో నగరంలోని సీడబ్ల్యూసీ గృహంలో చేర్చారు. ఆదరించాల్సిన పాస్టర్ బాలుడిని చితకబాది హింసిస్తుండడంతో అక్కడి నుంచి ఆ బాలుడు తప్పించుకుని రోడ్డునపడ్డాడు. ఆకలి తట్టుకోలేక సెల్‌ఫోన్లు చోరీ చేసి వాటిని అమ్ముకుని పొట్ట పోసుకున్నాడు. ఈ క్రమంలోనే తన వాళ్లను కలుసుకునేందుకు సూరత్‌కు వెళ్లేవాడు. అక్కడ తల్లిదండ్రుల జాడ కనిపించక తిరిగి అనంతపురం చేరుకున్నాడు. స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని ఓ హోటల్‌లో సప్లయర్‌గా చేరాడు. అలా 18 ఏళ్లు దాటాయి. దొంగతనాలు చేయడం మాత్రం మానలేదు. కొంత కాలం క్రితం స్థానిక రెండో రోడ్డులోని ఓ ఇంట్లో చొరబడి కొన్ని దుస్తులు, కొంత బంగారం, డబ్బు దొంగిలించాడు. మళ్లీ కన్న వారి కోసం పయనమయ్యాడు.

ఫలితం కానరాక.. మళ్లీ నగరానికి..

అయిన వారిని కలుసుకుందామని వినయ్ చేసిన ప్రయత్నం మళ్లీ ఫలించలేదు. దీంతో మళ్లీ నగరానికి చేరుకున్నాడు. రెండో సారి కూడా రెండో రోడ్డులోని అదే ఇంట్లో కొంత నగదు చోరీ చేశాడు. అదే క్రమంలో ఇటీవల మూడో సారి మళ్లీ అదే ఇంట్లో చొరబడి కొంత డబ్బు, బంగారం, పంచలోహ విగ్రహం తీసుకుని తాను పనిచేస్తున్న హోటల్‌కు వెళ్లాడు. తనతో పాటు అక్కడ పనిచేస్తున్న మహిళకు బంగారు నెక్లెస్, తోటి కార్మికుడికి బంగారు గొలుసు, హోటల్ యజమానికి పంచలోహ విగ్రహం ఇచ్చాడు. అయితే, మహిళ తనకిచ్చిన నెక్లెస్ గిల్టుదని భావించి అందరి ముందే మురికి కాలువలోకి విసిరేసింది. ఈ క్రమంలోనే తన ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడం, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగ కోసం ఆరా తీస్తుండగా.. బంగారాన్ని కొందరికి ఉచితంగా ఇచ్చిన వినయ్ విషయం తెలిసి అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. చోరీ చేసిన వైనాన్ని ఒప్పుకోవడంతో సొంతూరులో బంగారం ఎక్కడైనా దాచుంటాడని గుజరాత్‌లోని సూరత్‌కు తీసుకెళ్లారు. అయితే, అక్కడ అతనికి తెలిసిన వారు లేరు. దీంతో ఎందుకు ఇంత దూరం రావాల్సి వచ్చిందని వినయ్‌ను ఆరా తీస్తే తన గతాన్నంతా పూసగుచ్చినట్టు వివరించాడు. చలించిన పోలీసులు అతని కుటుంబ సభ్యుల కోసం ఆరా తీస్తే తల్లి మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందని, తండ్రి కొన్ని రోజుల క్రితమే మృతి చెందాడని తెలిసింది. ఈ విషయాన్ని ఇప్పటికీ పోలీసులు వినయ్‌కు చెప్పలేదు. దొంగతనం చేశాడని మందలించాలో.. అతని వెనక ఇంతటి కన్నీటి గాథ ఉందని బాధ పడాలో తెలియని స్థితిలో పోలీసులు ఉండిపోయారు.

గురుకులాల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి ఆమోదం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించనున్నారు. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ విభాగం జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మలుగూరు పాఠశాలలో టీజీటీ ఫిజిక్స్, హిందూపురం బాలికల పాఠశాలలో టీజీటీ గణితం, పీజీటీ ఫిజిక్స్, రొళ్ల పాఠశాలలో టీజీటీ ఫిజిక్స్, పీజీటీ ఫిజిక్స్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆయా స్కూళ్లలోకానీ, జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో గాని దరఖాస్తులు అందజేయవచ్చు. బీఈడీలో సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన వారు అర్హులు. బాలికల కళాశాలలకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. టెట్ అర్హతతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధనలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతుడు రామన్న

మడకశిర రూరల్: బొలెరో ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... టైల్స్ పనులతో జీవనం సాగిస్తున్న మడకశిరకు చెందిన రామన్న, నంద్యాలకు చెందిన ఇమ్రాన్, షమీర్.. శనివారం రాత్రి హిందూపురంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. మడకశిర మండలం అగ్రంపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో రామన్న అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన షమీర్, ఇమ్రాన్‌ను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

రూ.74.60 కోట్ల పింఛన్ మొత్తం పంపిణీ



పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వెంగళమ్మచెరువు వలంటీర్ చంద్రశేఖర్

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక జిల్లాలో జోరుగా సాగుతోంది. నాలుగోరోజు శనివారం నాటికి వలంటీర్లు జిల్లాలోని 2,68,453 మందికి రూ.74,60,00,000 మొత్తం అందజేశారు. దీంతో జిల్లాలో పింఛన్ పంపిణీ శాతం 98.5 శాతానికి చేరింది. పింఛన్ పంపిణీ ఆదివారంతో ముగియనుండగా, మిగిలిన 1.5 శాతం మందికీ పింఛన్ మొత్తం అందించేందుకు కృషి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి, ఆరోగ్య సమస్యలతో బంధువుల ఇళ్లలో విశ్రాంతి తీసుకుంటున్న వారి వద్దకే వలంటీర్లు వెళ్లి పింఛన్ అందించడంతో లబ్ధిదారుల మోముల్లో ఆనందం కనిపించింది.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

- రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యుల్ ఆనంద్



కొట్లపల్లిలో జామలో అంతర పంటగా వేసిన అలసందను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఎలాంటి రసాయనాలు వాడకుండా రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తే పెట్టుబడి తగ్గి అధిక లాభాలు వస్తాయని రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విశ్రాంత ఐఏఎస్ శామ్యుల్ ఆనంద్ అన్నారు. శనివారం ఆయన ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్‌తో కలిసి పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి, కొట్లపల్లి, మార్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగుచేస్తున్న జామ, కూరగాయలు, బొప్పాయి, ఆముదం, అలసంద, గోరుచిక్కుడు, సజ్జ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ...తాము సాగు చేసిన పంటలకు ఎలాంటి హానికరమైన మందులు పిచికారీ చేయలేదన్నారు. కేవలం పేడ, ఆకులు, ఇతర వ్యర్థాలతో కుళ్లబెట్టిన ఎరువులు, డంపింగ్ యార్డుల్లో దొరికే సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో తమకు ఖర్చు తగ్గడంతో పాటు ఆయా ఆహార ఉత్పత్తుల తినే వారికీ మేలు జరుగుతోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 100 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, రానున్న రోజుల్లో జిల్లా అంతటా విస్తరించనున్నట్లు ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక

పుట్టపర్తి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. బుక్కపట్నం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం అండర్–17, అండర్ 19 బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. వివిధ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను స్కూల్ గేమ్స్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు జగదీష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉభయ జిల్లాల కార్యదర్శులు సుగుణమ్మ, అంజన్న, రాష్ట్ర సెక్రటరీ మోహర్ రెడ్డి, పీడీ నాగరాజు పర్యవేక్షించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలఫెర్రర్



నాప్‌కిన్ తయారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న విశాలఫెర్రర్

గాండ్లపెంట: మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెంది, సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని పొందడమే లక్ష్యంగా ఆర్డీటీ చర్యలు చేపట్టిందని ఆ సంస్థ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలఫెర్రర్ అన్నారు. స్థానిక ఆర్డీటీ కార్యాలయంలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రూ.26 లక్షల విలువ చేసే నాప్‌కిన్ తయారీ యంత్రాన్ని శనివారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. మహిళలు స్వశక్తితో జీవించేలా నాప్‌కిన్ తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, స్పెయిన్ సభ్యురాలు ఇటాతి, ఎంఅండ్ఈ ఇందిరమ్మ, రామప్రతాపరెడ్డి, సరస్వతి, ఎస్టీఎల్ వనజ, ఎటీఎల్ కృష్ణా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ గోపాలరెడ్డి

మడకశిర: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ గోపాలరెడ్డి ఆదేశించారు. పీఆర్ శాఖ ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. మండలాల వారీగా చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల భవనాలు, సీసీ రోడ్లు, నాడు–నేడు పనులు, గడపగడపకూ మన ప్రభుత్వం పనులపై ఆరా తీశారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తోందని, అయితే పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమై పనులు వేగవంతంగా పూర్తి చేయడంపై చర్చించారు. సమావేశంలో అమరాపురం జెడ్పీటీసీ స్వారక్క, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జాతీయ సైన్స్ కాంగ్రెస్

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఏడు ప్రాజెక్ట్‌ల ఎంపిక



ప్రసంగిస్తున్న జిల్లా సైన్స్ కాంగ్రెస్ అధికారి వెంకటరమణ

ప్రశాంతి నిలయం: సమాజ హితాన్ని కాంక్షించే నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక సమాచార మండలి, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన 31వ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ ఆకట్టుకుంది. పోటీలకు 107 ప్రాజెక్టులను జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తీసుకువచ్చారు. వీటిలో అత్యుత్తమమైన ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్లను అభినందిస్తూ వెంకటరమణ మాట్లాడారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. భవిష్యత్తు మానవ మనుగడ సైన్స్ పైనే ఆధారపడి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటస్వామి, అకడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్లు నాగ అనిల్, విశ్వనాథ్, ప్రభాకర్, మల్లికార్జున, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులు			
పాఠశాల	విద్యార్థి	ప్రాజెక్ట్ టైటిల్	గైడ్ టీచర్
ఏపీఎంఎస్, అగళి	పి.యశ్వంత్	ప్రొడక్షన్ ఆఫ్ ఎలక్ట్రిక్ ఫ్రం వెజిటెబుల్ వేస్ట్	వాయల్పతుల్ షేక్
డీవీడీజీఎస్, చిన్మయి విద్యాలయ, హిందూపురం	బి.విష్ణు సహస్ర	ఇంపాక్ట్ ఆఫ్ సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ ఆన్ ఎకో సిస్టం	మారుతి
జెడ్పీహెచ్ఎస్, తంగేడుకుంట, ఓడీసీ	పి.హర్షవర్ధన్	డిజైన్ ఎ లో కాస్ట్ ఎకో ఫ్రెండ్లీ వాటర్ ప్యూరిఫైయింగ్	మనోహర్ శ్రీనివాసనాయక్
జెడ్పీహెచ్ఎస్, బుల్లసముద్రం, మడకశిర	మహమ్మద్ అనాస్	యాన్ ఎకో వేస్ట్ యూస్‌ఫుల్ ఇన్ మెనీ వేస్	సత్యలక్ష్మి
జెడ్పీహెచ్ఎస్, ఉప్పలపాడు, ముదిగుబ్బ	పి.ప్రవళిక	పోట్ ఇన్‌సినరేటర్	వసంతరాణి
జెడ్పీహెచ్ఎస్, ధనాపురం, పరిగి	ఎల్.మంజుల	ఫ్రెండ్లీ నేచర్ ప్రొడక్ట్స్	రాధమ్మ
జెడ్పీహెచ్ఎస్, బండ్లపల్లి, కొత్తచెరువు	కె.ప్రమీల	ట్రెడిషనల్ మెడికల్ నాలెడ్జ్	ఉమాదేవి

కిడ్నాపర్ల చెర నుంచి విముక్తి



స్వామీజీ రామణ్ణ

పావగడ: తాలూకా వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన స్వామీజీ రామణ్ణ కిడ్నాప్ ఉదంతం పోలీసుల చొరవతో ఎట్టకేలకు సుఖాంతమైంది. రెండు రోజుల క్రితం రామణ్ణను కిడ్నాపర్లు అపహరించుకెళ్లి బెంగుళూరులోని బ్యాటరాయనపుర ప్రాంతంలో ఉన్న ఓ రేకుల షెడ్డులో బంధించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ విషయాన్ని సీఐ సురేష్ నేతృత్వంలో క్రైం ఎస్ఐ విజయ్‌కుమార్ బృందం గుర్తించి శనివారం ఉదయం అక్కడకు చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ప్రధాన నిందితుడు మడకశిర మండలం శంకరగల్లుకు చెందిన హరీష్ పరారయ్యాడు. మరో నలుగురు పట్టుబడ్డారు. రామణ్ణను పోలీసులు విడిపించారు. పట్టుబడిన వారిలో మడకశిర మండలం కోతులగుట్టకు చెందిన నరేష్, బెంగళూరుకు చెందిన మరో ముగ్గురు ఉన్నారు. విచారణ అనంతరం బాధితుడు రామణ్ణ స్వామిని పోలీసులు వదిలేశారు. కాగా, రామణ్ణ స్వామి తో అంత్రాలు వేయించుకునేందుకు హరీష్ వచ్చేవాడు. ఈ క్రమంలో రామణ్ణ వద్ద ఉన్న డబ్బు చూసి అత్యాశకు పోయి కిడ్నాప్ నాటకానికి తెరలేపాడు. రూ.16 లక్షలు డిమాండ్ చేస్తూ రామణ్ణ కుమారుడికి చేసిన ఫోన్ కాల్స్ ఆధారంగా పోలీసులు కిడ్నాపర్ల ఆచూకీని పసిగట్టి నిందితులను అదుపులోకి తీసుకుని బాధితుడిని విడిపించారు. కాగా, మద్యం మత్తులో పలుమార్లు రామణ్ణపై కిడ్నాపర్లు భౌతికంగా దాడి చేసినట్లు తెలిసింది.